**జర్నలిస్టులు కావలెను**

క్రైం కౌంటర్ తెలుగు దినపత్రిక గత 15 సంవత్సరాలుగా పత్రికా రంగంలో ప్రత్యేక గుర్తింపు కలిగిన క్రైం కౌంటర్ తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు ఆసక్తి, అనుభవం కలిగిన జర్నలిస్టులు కావలెను.

క్రిష్ణా



APTEL/25/A2844

# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 166 సోమవారం 11- 05 - 2026 పేజీలు : 4 వెల. 2



**రిపోర్టర్లు కావలెను**

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349




# జూన్ 12 వరకు వేసవి సెలవులు

## ఆంధ్ర ప్రదేశ్ హై కోర్ట్ నిర్ణయం

*మే 14, 21, 28, జూన్ 4, 11లలో అత్యవసర కేసులు విచారణ.*

**ది 10 మే 2026. (బాపట్ల బ్యూరో చీఫ్ రెడ్డి వర ప్రసాద్)** ఈ నెల 11 నుంచి జూన్ 12 వరకు హైకోర్టుకు వేసవి సెలవులు ప్రకటించారు. జూన్ 15న పూర్తిస్థాయిలో కార్యకలాపాలు తిరిగి ప్రారంభం కానున్నాయి. సెలవుల్లో అత్యవసర కేసుల విచారణకు వెకేషన్ బెంచ్లు ఏర్పాటు చేస్తూ రిజిస్ట్రార్ జనరల్ పార్థసారథి ఉత్తర్వులిచ్చారు. మొదటి దశలో మే 14, 21, 28 తేదీల్లో విచారణలు ఉంటాయి. హైకోర్టు న్యాయ మూర్తులు డాక్టర్ జస్టిస్ వై. లక్ష్మణరావు, జస్టిస్ మెడమల్లి బాలాజీ డివిజన్ బెంచ్, జస్టిస్ తుహిన్ కుమార్ సింగిల్ బెంచ్ విచారణ చేపడతారు. రెండో దశలో జూన్ 4, 11 తేదీల్లో విచారణలు జరగనున్నాయి. జస్టిస్ కె. సురేష్ రెడ్డి, జస్టిస్ హరిహరనాథ శర్మ డివిజన్ బెంచ్, జస్టిస్ ఎస్. సుబ్బారెడ్డి సింగిల్ బెంచ్లో కేసులను విచారిస్తారు. మరోవైపు డివిజన్ బెంచ్ కేసుల విచారణ పూర్తయ్యాక న్యాయమూర్తులు సింగిల్ బెంచ్ విధులనూ నిర్వహిస్తారు.




## మోదీ కాన్వాయ్ మార్గంలో జిలెటిన్ స్టిక్స్

బెంగళూరు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ఉదయం బెంగళూరు పర్యటన సందర్భంగా ఆయన కాన్వాయ్ వెళ్లే మార్గంలో జిలెటిన్ స్టిక్స్‌తో కూడిన ఒక బ్యాగ్‌ను పోలీసులు గుర్తించారు. దీంతో హైఅలర్ట్ ప్రకటించారు. బాంబు డిస్పోజల్, ఫోరెన్సిక్ బృందాలో రంగంలోకి దిగి ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. ఆర్ట్ ఆఫ్ లివింగ్ వెన్యూకు దారితీసే మార్గంలోని కగ్గలిపుర ప్రాంతంలోని తాతగుణి వద్ద ఈ పేలుడు పదార్థాలను కనుగొన్నారు. ఇందుకు సంబంధించి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

సెక్యూరిటీ అలర్ట్

ప్రధానమంత్రి 45వ ఆర్ట్ ఆఫ్ లివింగ్ వార్షికోత్సవంలో పాల్గొనేందుకు బెంగళూరు వచ్చారు. ఆయన కాన్వాయ్ వెళ్లే మార్గానికి సమీపంలోనే జిలెటిన్ స్టిక్స్ కనిపించడంతో పోలీసులు హైఅలర్ట్ ప్రకటించారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో వాహనాలను కొద్దిసేపు ఎక్కడికక్కడే నిలిపివేసి క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. సెర్చ్ ఆపరేషన్‌లో ఒక బ్రిడ్జి సమీపంలో జిలెటిన్ స్టిక్స్‌ను కనుగొన్నారు. వీటిని ఉద్దేశపూర్వకంగానే అక్కడ ఉంచినట్టు ప్రాథమికంగా పోలీసులు అంచనా వేస్తున్నారు. అయితే ఆ లొకేషన్‌కు ఎవరు, ఎలా తీసుకువచ్చారు, దీని వెనుక కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

నిర్బంధంలో అనుమానితుడు

ఈ కేసుకు సంబంధించి కొరమంగళ సమీపంలోని ఇంటి నుంచి ఒక వ్యక్తిని పోలీసులు నిర్బంధంలోకి తీసుకున్నారు. ఆ వ్యక్తి ఆదివారం ఉదయం స్థానిక పోలీసు స్టేషన్‌కు ఫోన్ చేసి హెచ్ఏఎల్ ఎయిర్‌పోర్ట్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సెంటర్ సమీపంలో పేలుళ్లకు అవకాశం ఉందని హెచ్చరించినట్టు అధికారులు చెబుతున్నారు. హెచ్ఏఎల్ విమానాశ్రయం వద్ద ఎలాంటి పేలుడు పదార్థాలు దొరకనప్పటికీ, ఆ తరువాత ఆర్ట్ ఆఫ్ లివింగ్ సెంటర్‌కు వెళ్లే మార్గం సమీపంలో జిలెటిన్ స్టిక్స్ కనిపించాయి. కాగా, పోలీసులు నిర్బంధంలోకి తీసుకున్న వ్యక్తి గతంలోనూ వివిపీ పర్యటనల్లో ఇదే తరహా హెచ్చరికలు చేసినట్టు గుర్తించారు. అయితే అతను మానసిక సమస్యలతో బాధపడుతున్నాడంటూ గతంలో విడిచిపెట్టినప్పటికీ ఈసారి పేలుడు పదార్థాలు దొరకడంతో ఈ కేసును పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు.

## మోదీ ఆశీస్సులు, మార్గదర్శనం నాకు ఎప్పటికీ ప్రత్యేకం: పవన్ కల్యాణ్




**క్రైం కౌంటర్ న్యూస్ మే 10:** ప్రధానమంత్రి నరేంద్రమోదీకి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మీయ స్వాగతం పలకడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. తన సతీమణి అన్నా కొణిదాల, పిల్లలు అకీరానందన్, ఆద్య, పోలినా అంజని, మార్క్ శంకర్‌లతో కలిసి ప్రధానికి ఆత్మీయ స్వాగతం పలికినట్లు పేర్కొన్నారు. తన ఆరోగ్య పరిస్థితి గురించి వ్యక్తిగతంగా తెలుసుకోవడానికి ప్రధాని మోదీ తన నివాసానికి రావడం ఆయనలోని ఆప్యాయత, మానవతా దృక్పథానికి నిదర్శనమని పవన్ కల్యాణ్ తెలిపారు.

పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిపై మోదీ ప్రత్యేక శ్రద్ధ..

తన శస్త్రచికిత్స అనంతరం ప్రధాని మోదీ వ్యక్తిగతంగా ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారని పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఆ సమయంలో ప్రధాని తనకు ధైర్యం చెప్పి మద్దతుగా నిలిచారని తెలిపారు. ఇప్పుడు తాను కోలుకుంటున్న సమయంలో స్వయంగా తన నివాసానికి రావడం ప్రధాని చూపిన అపారమైన శ్రద్ధకు నిదర్శనమని చెప్పుకొచ్చారు. ఈ విషయాన్ని తాను జీవితాంతం గుర్తుంచుకుంటానని పేర్కొన్నారు. ప్రధాని మోదీ వ్యక్తిత్వంపై ప్రశంసలు కురిపించారు. ప్రధాని ప్రతి ఒక్కరినీ తమ కుటుంబ సభ్యుల్లా చూస్తారని.. ఆయన ఆలోచనలు, చేతల్లో ఎప్పుడూ ప్రజల సంక్షేమమే ప్రధానంగా కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. దేశానికి నాయకత్వం వహించే బాధ్యతల మధ్య కూడా తనతో వ్యక్తిగత అనుబంధాన్ని కొనసాగించడం ఆయన చూపిన ప్రత్యేకత అని కొనియాడారు.

మోదీ నాయకత్వం స్ఫూర్తిదాయకం..

ప్రధాని మోదీ నాయకత్వం, దేశ ప్రగతిపై అంకితభావం కోట్లాది మందికి స్ఫూర్తిగా నిలుస్తోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. మోదీ వినయం, కరుణ, ప్రజలతో ఆయనకున్న భావోద్వేగ అనుబంధం భారతదేశవ్యాప్తంగా లక్షలాది మందికి ప్రేరణగా నిలుస్తోందని తెలిపారు.

మోదీకి కృతజ్ఞతలు తెలిపిన పవన్..

మోదీ తనపై చూపిన ఆప్యాయత, శ్రద్ధ, మద్దతుకు పవన్ కల్యాణ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాని ఆశీస్సులు, మార్గదర్శనం తనకు ఎప్పటికీ ప్రత్యేకంగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. ఆయన తమ కుటుంబంతో గడిపిన సమయం ఎంతో విలువైనదని, ఈ పర్యటన చిరస్మరణీయమని తెలిపారు. పవన్ కల్యాణ్ చేసిన ఈ ట్వీట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. జనసేన, బీజేపీ కార్యకర్తలు పెద్దఎత్తున స్పందిస్తూ ప్రధాని మోదీ, పవన్ కల్యాణ్ మధ్య ఉన్న అనుబంధాన్ని ప్రశంసిస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా వ్యక్తిగత పరామర్శకు ప్రాధాన్యం ఇచ్చిన ప్రధాని మోదీపై పలువురు నేతలు కూడా అభినందనలు తెలుపుతున్నారు.

## అమ్మకు చెప్పలేని పని ఎప్పుడూ.. ఎవ్వరూ చేయొద్దు: లోకేశ్



**అమరావతి, క్రైం కౌంటర్ న్యూస్ మే 10:** మదర్స్ డే నేడు. ఈ నేపథ్యంలో తన తల్లి నారా భువనేశ్వరికి ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యా శాఖ మంత్రి, టీడీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేశ్ మదర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం తన ఎక్స్ ఖాతా వేదికగా నారా లోకేశ్ స్పందించారు. ' కనిపించే ప్రతి స్త్రీ.. కని పెంచిన అమ్మతో సమానం. మనల్ని ఈ లోకానికి పరిచయం చేసిన అమ్మకు చెప్పలేని పని ఎప్పుడూ, ఎవ్వరూ చేయొద్దు. ఇదే ప్రతి అమ్మ కోరుకునే కానుక. చిన్నప్పటి నుంచే మహిళలను గౌరవించడం, స్త్రీ పురుషులు సమానం అనే భావన నాలో పెంపొందించింది అమ్మ.నా తల్లి స్ఫూర్తితోనే విద్యా శాఖలో నైతిక విలువల పాఠాలు ప్రవేశపెట్టాం. మహిళా సాధికారత లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం మహిళలకు స్త్రీ శక్తి పేరుతో ఉచిత బస్సు ప్రయాణం, దీపం 2 పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తుంది. బిడ్డలకు గురువు, దైవం, మార్గదర్శి రూపంలో అన్నీ తానైన మాతృమూర్తులందరికీ మదర్స్ డే శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. లవ్ యూ అమ్మా' అని నారా లోకేశ్ పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో 'తలసేమియా రన్'.. జెండా ఊపి ప్రారంభించిన నారా భువనేశ్వరి



**హైదరాబాద్, క్రైం కౌంటర్ న్యూస్ మే 10:** సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుండే ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్.. తలసేమియా వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మరో కీలక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డు వేదికగా భారీ 'తలసేమియా రన్' నిర్వహించనున్నట్లు ట్రస్ట్ ప్రతినిధులు వెల్లడించారు. నగరంలోని జలవిహార్ నుంచి ప్రారంభమైన ఈ రన్‌కు ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నారా భువనేశ్వరి జెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ.. 'తలసేమియాతో చాలా మంది చిన్నారులు చనిపోతున్నారు. బాధితులను కాపాడేందుకు రక్తమార్పిడి ఒక్కటే మార్గం. రక్తదానం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలూ రావు. దేశంలో ఏటా 12 వేలమంది తలసేమియాతో జన్మిస్తున్నారు. తలసేమియా బాధితులకు రక్తదానం బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. యువత తప్పనిసరిగా స్క్రీనింగ్ చేయించుకోవాలి. విజయవాడ, అనంతపురంలో తలసేమియా కేంద్రాలు, బ్లడ్ బ్యాంక్‌లు ఉన్నాయి. గత కొన్ని దశాబ్దాలుగా తలసేమియా బాధితులకు ఉచితంగా రక్తాన్ని అందించడంతో పాటూ వారికి అవసరమైన వైద్య సేవలను ఎన్టీఆర్ ట్రస్ట్ నిరంతరం అందిస్తోంది' అని అన్నారు.



# మదర్స్ డే సందర్భంగా యాత్రికులకు 'శర్బత్' పంపిణీ

### ముఖ్య అతిథిగా పాల్గొన్న పీఎన్బీఎస్ డిప్యూటీ సిటిఎం పవన్ కుమార్



**ఏపీ,విజయవాడ,మే 10(క్రైం కౌంటర్ బ్యూరో చీఫ్ సల్మాన్):**మదర్స్ డే సందర్భంగా ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ 'సిటీ పోర్ట్' సమీపంలోని శంకర్ విలాస్ హోటల్ వద్ద ఆదివారం యాత్రికులకు 'శర్బత్'పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని పీఎన్బీఎస్ డిప్యూటీ సిటిఎం పవన్ కుమార్ ప్రారంభించారు. వేసవి ఎండల నేపథ్యంలో ప్రయాణికులకు ఉపశమనం కలిగించే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు శ్రీ వెంకట సాయి, నాని, మోహిత్, సురేష్, శ్రీనివాస్, దూంది, రాజేష్ కుమార్ జోసెఫ్, కుషాల్, కుమార్, పవన్ కృష్ణ, భాను పూజిత్, సాయి తేజ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆర్టీసీ సిబ్బంది, పలువురు ప్రయాణికులు హాజరై కార్యక్రమాన్ని అభినందించారు.

# కడప అల్లర్లు దురదృష్టకరం.!

### – అల్లర్ల నివారణలో ఇంటెలిజెన్స్ వైఫల్యం
### – ?సోదరభావంతో సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి
### శాంతి భద్రతలు కాపాడాలి– అల్తాఫ్ బాబా





**ఎన్టీఆర్ జిల్లా,కొండపల్లి మున్సిపాలిటీ,మే 10(క్రైం కౌంటర్ బ్యూరో చీఫ్ సల్మాన్):** కడపలో జరిగిన అల్లర్లు అత్యంత దురదృష్టకరమని రాష్ట్ర అహలే సున్నతుల్ జమాత్ కన్వీనర్ అల్తాఫ్ బాబా ఆవేదన వ్యక్తం చేశారు. కొండపల్లిలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర హోంశాఖ మంత్రి వెంటనే స్పందించి సమస్యను శాంతియుతంగా పరిష్కరించాలని కోరారు.రాష్ట్ర అభివృద్ధి జరుగుతున్న సమయంలో ఇలాంటి ఘటనలు మంచివి కావని పేర్కొన్నారు. అల్లర్లను అరికట్టడంలో ఇంటెలిజెన్స్ వ్యవస్థ విఫలమైందని విమర్శించారు. ఇరు వర్గాలపై కేసులు పెట్టడం కంటే శాంతి వాతావరణంలో సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో అన్ని మతాల ప్రజలు సోదరభావంతో జీవిస్తున్నారని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం మైత్రి సంఘాలు ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడాలని రాష్ట్ర ముఖ్యమంత్రి మరియు హోంమంత్రి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# అనకాపల్లి ఆర్మీ ఉద్యోగి.. డెహ్రాడూన్‌లో మృతి




**క్రైం కౌంటర్ న్యూస్ మే 10:** ఇండియన్ ఆర్మీలో నాయక్‌గా పనిచేస్తున్న అనకాపల్లి మండలం వెంకుపాలెం గ్రామానికి చెందిన రాపేటి పూర్ణచంద్రశేఖర్ (37) ప్రమాదవశాత్తూ శుక్రవారం రాత్రి మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... డెహ్రాడూన్‌లో విధులు నిర్వహిస్తున్న పూర్ణచంద్రరావు శుక్రవారం రాత్రి ట్రక్కులో వెళుతుండగా, ఒకచోట ఆర్చి ఒక్కసారిగా కూలిపడింది. ఈ ప్రమాదంలో చంద్రశేఖర్, నాగాలాండ్‌కు చెందిన మరో ఉద్యోగి మృతిచెందారు. పూర్ణచంద్రశేఖర్‌కు భార్య, రెండేళ్ల కుమార్తె, ఐదేళ్ల కుమారుడు ఉన్నారు. చంద్రశేఖర్ నెలన్నర కిందటే కుటుంబాన్ని డెహ్రాడూన్ తీసుకువెళ్లారు. ఇంతలో ఇలా జరగడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.




# కొండపల్లి బస్టాప్ వద్ద అదుపుతప్పిన దోస్త్ వాహనం

## –ఇద్దరికీ తీవ్ర గాయాలు

### క్షతగాత్రులను 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన ఆర్ ఎస్ ఐ శివరాం

**ఎన్టీఆర్ జిల్లా,ఇబ్రహీంపట్నం,మే 10(క్రైం కౌంటర్ బ్యూరో చీఫ్ సల్మాన్):** ఇబ్రహీంపట్నం సర్కిల్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ఓ అశోక్ లేలాండ్ దోస్త్ వాహనం అదుపుతప్పి ఇద్దరు పాదచారులను ఢీకొట్టిన ఘటన ఆదివారం సాయంత్రం ఇబ్రహీంపట్నం వద్ద చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం, ఏపీ 39 టీఎక్స్ 7711 నంబర్ గల దోస్త్ వాహనంలో సుమారు 20 మందితో పెనుగంచిప్రోలు గుడికి వెళ్లి తిరిగి విజయవాడ వైపు వస్తుండగా, ఇబ్రహీంపట్నం రింగ్‌సెంటర్ సమీపంలోని డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో వాహనం కుడివైపు టైరు పగిలిపోవడంతో అదుపుతప్పి, నడుచుకుంటూ కొండపల్లి వైపు వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను ఢీకొట్టింది. క్షతగాత్రులను రెంటపల్లి పెద్దవట్టయ్య (52) ఈలప్రోలు గ్రామానికి చెందిన మల్లెపూల వ్యాపారి, అలాగే ఉల్లిపాయల.శ్రీను (55) ఏ.కొండూరు మండలం కొత్తగూడెంకు చెందిన పండ్ల వ్యాపారిగా గుర్తించారు. గాయపడిన వారిని అక్కడే విధులు నిర్వహిస్తున్న ఆర్ ఎస్ ఐ శివరాం తన సిబ్బందితో కలిసి 108 అంబులెన్స్‌లో ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వాహనాన్ని 'తుమ్మి పండు' అనే వ్యక్తి నడుపుతున్నట్లు సమాచారం. ప్రమాదానికి గురైన వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# విశాఖకు సెమీ రింగ్ రోడ్డు

### రాంబిల్లి నుంచి భోగాపురం వరకు నిర్మాణం
### ల్యాండ్ పూలింగ్ ద్వారా భూ సేకరణ
### రూ.14 వేల కోట్లతో రాష్ట్రంలో ప్రతి ఇంటికీ తాగునీరు
### పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ




**క్రైం కౌంటర్ న్యూస్ మే 10:** విశాఖపట్నానికి 102 కిలోమీటర్ల మేర సెమీ రింగ్‌రోడ్డు నిర్మిస్తామని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. విశాఖ మహా నగర ప్రాంతాభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ)లో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించిన ఆయన ఆ తర్వాత విలేకరులతో మాట్లాడారు. రాంబిల్లి నుంచి విశాఖ మీదుగా భోగాపురం వరకు ఈ సెమీ రింగ్‌రోడ్డు వస్తుందని తెలిపారు. దీనికి డీపీఆర్ తయారవుతోందని, ప్రజా ప్రతినిధులతో చర్చించిన తర్వాత అలైన్‌మెంట్ నిర్ణయిస్తామని వెల్లడించారు. అవసరమైన భూమిని ల్యాండ్ పూలింగ్ విధానంలో సేకరిస్తామన్నారు. రింగ్ రోడ్డుకు ఇరువైపులా లేఅవుట్లు వేసి, రైతులకు వాటా ఇస్తామని తెలిపారు. భోగాపురం విమానాశ్రయానికి అనుసంధానిస్తూ బీచ్ కారిడార్ నిర్మాణం కూడా చేపడతామన్నారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ తాగునీరు ఇచ్చేందుకు రూ.14 వేల కోట్లతో పనులు జరుగుతున్నాయని మంత్రి చెప్పారు. భూగర్భ కాలువల నిర్మాణానికి ప్రత్యేక మాస్టర్ ప్లాన్ ఉందన్నారు. వర్షపు నీరు పోవడానికి ఓపెన్ డ్రైన్లు నిర్మిస్తామన్నారు. ఇళ్లలో కిచెన్, బాత్‌రూమ్‌ల్లో ఉపయోగించిన నీరు పోవడానికి ప్రత్యేక కాలువలు నిర్మించే ప్రణాళిక ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వీటి నిర్మాణానికి రూ.29 వేల కోట్లు అవసరమని, ముందుగా జనాభా ఎక్కువగా, మీడియంగా ఉండే ప్రాంతాల్లో రూ.9 వేల కోట్లతో వీటి నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 123 మునిసిపాలిటీలలో మురుగునీటి శుద్ధి కేంద్రాలు(ఎ?సటీపీ) నిర్మాణానికి టెండర్లు పిలిచామన్నారు. భూమి విలువను బట్టి పన్ను వేసే విధానం గత ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిందని, దానినే కొనసాగిస్తున్నామని మంత్రి నారాయణ స్పష్టంచేశారు.

# పర్యాటక హబ్‌గా కైలాసగిరి



**క్రైం కౌంటర్ న్యూస్ మే 10:** విశాఖపట్నంలో కైలాసగిరిని పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేస్తామని, అందుకుగాను ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేశామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. కైలాసగిరిపై రూ.2.5 కోట్ల వ్యయంతో నిర్మించిన 65 అడుగుల ఎత్తైన త్రిశూలం, ఢమరుకాలను శనివారం ఉదయం ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీలు శ్రీభరత్, కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లా ఎమ్మెల్యేలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ, రాష్ట్రంలో పర్యాటక రంగానికి సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, దీనివల్ల ఆదాయంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని చెప్పారు. విశాఖలో ఈ త్రిశూలం పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణంగా నిలుస్తుందని తెలిపారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ అతి తక్కువ సమయంలో త్రిశూలం ప్రాజెక్టును పూర్తిచేసిన వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ కృషిని అభినందించారు. కైలాసగిరి అభివృద్ధికి ప్రత్యేకమైన మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని ఎంపీ శ్రీభరత్ చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, పంచకర్ల రమేశ్‌బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, బండారు సత్యనారాయణమూర్తి, లోకం నాగమాధవి, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ తేజ్‌భరత్, సీఈ వినయకుమార్, సీఏఓ హరిప్రసాద్, బ్రహ్మకుమారీలు, అన్నమయ్య ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాల నిర్వహణకు ప్రణాళికలు

### రూ.54.71 కోట్లతో నదీ పరీవాహక ఆలయాల అభివృద్ధి
### 5వేల భజన మందిరాలు నిర్మిస్తాం: మంత్రి ఆనం



**క్రైం కౌంటర్ న్యూస్ మే 10:** గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలో రూ.29 కోట్లతో చేపట్టిన ఆలయ అభివృద్ధి పనులను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకూ జరిగే పుష్కరాలను ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసేలా నిర్వహిస్తామని చెప్పారు. నదీ పరీవాహక ప్రాంతంలోని 43 ఆలయాలను రూ.54.71 కోట్లతో అభివృద్ధి చేస్తామని తెలిపారు. 'రాష్ట్రంలోని 6,200 దేవాలయాల్లో ధూప, దీప, నైవేద్యాల కోసం అర్చకులకు ఏటా రూ.74.74 కోట్లు అందిస్తున్నాం. 27 వేల ఆలయాలకు పూర్వ వైభవం తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇంతవరకు 691 దేవాలయాల అభివృద్ధికి రూ.842.67 కోట్లతో పనులు చేపట్టాం. సనాతన ధర్మ పరిరక్షణ కోసం ఆలయాలు లేని కుగ్రామాలు, కాలనీల్లో శ్రీవాణి ట్రస్టు నిధులతో 5శాతం వేల భజన మందిరాలు (చిన్న దేవాలయాలు) నిర్మిస్తాం. ఇంతవరకు 1,059 భజన మందిరాల నిర్మాణానికి రూ.181.10 కోట్లు మంజూరు చేశాం' అని మంత్రి వివరించారు. 'వేదం చదివే విద్యార్థులకు నెలకు రూ.3వేలు చొప్పున మూడేళ్లు భృతి ఇస్తాం. రామతీర్థం, శ్రీకాళహస్తిల్లో గిరిప్రదక్షిణకు రూ.20కోట్లతో రోడ్డు మార్గాన్ని నిర్మిస్తున్నాం' అని ఆనం వెల్లడించారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, ఆలయ చైర్మన్ రాజా ఎస్వీ సుధాకరరావు పాల్గొన్నారు.

# 7మంది జవీలతో కలిసి నటించిన ఏకైక నటి

సినీ చరిత్రలో వెయ్యికి పైగా చిత్రాలతో గిన్నిస్ రికార్డు సృష్టించిన నటి మనోరమ. రంగస్థలంపై అన్నాదురై, కరుణానిధిలతో నటించిన ఆమె, వెండితెరపై జయలలిత వంటి దిగ్గజాలతో స్క్రీన్ షేర్ చేసుకున్నారు. తర్వాతి కాలంలో ఎం.కె. స్టాలిన్, విజయ్లతోనూ కలిసి నటించి, మొత్తం ఏడుగురు ముఖ్య మంత్రులతో పనిచేసిన ఏకైక నటిగా చరిత్రకెక్కారు. తరాలు మారినా ఆమె నటన అజరామరం.






# ఆ మేధ కృత్రిమమే..దాసోహం కావొద్దు

**క్రైం కౌంటర్ న్యూస్ మే 10:** సాంకేతికతను అనుకూలంగా మలచుకోవాలేగానీ, దానికి దాసోహం కాకూడదని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ సూచించారు. తూర్పుగోదావరి జిల్లా కేంద్రం రాజమహేంద్రవరంలో శనివారం పది కోర్టుల భవన సముదాయాన్ని ఆమె ప్రారంభించారు. కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'ఇవాళ యువత, పెద్దవాళ్లు కూడా కృత్రిమ మేధకు ఆకర్షితులవుతున్నారు. దయ చేసి అది కృత్రిమమైనదని గుర్తుంచుకోండి. ఆ వలలో చిక్కుకోకండి. మనం సాంకేతికతకు దాసోహం కాకూడదు. సాంకేతికతను అనుకూలంగా మలచుకోవడం ఓ మంచి ఉపాయం. న్యాయ వ్యవస్థ కేవలం కోర్టు గదులు, ఇటుకలకే పరిమితం కాదు. ప్రజల మనోభావాలకు సజీవ ప్రతిబింబం' అన్నారు. డిజిటలైజేషన్, డిజిటైజేషన్ మన వ్యవస్థలో భాగమైపోయాయని చెప్పారు. సాంకేతికత కారణంగానే కొవిడ్ విపత్తులోనూ కోర్టులు పనిచేశాయన్నారు. కోర్టుల్లో ఇప్పుడు మెరుగైన మౌలిక సదుపాయాలు వస్తున్నాయని.. అయితే ఎప్పటికప్పుడు వాటి నిర్వహణ, కాలానుగుణ అభివృద్ధిపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని చెప్పారు. రాజీ, మధ్యవర్తిత్వం అనేవి వైవాహిక, ప్రమాదాల కేసుల్లో మాత్రమే ఉపకరిస్తాయనుకోవడం సరికాదన్నారు. పలు రకాల కేసులను పరిష్కరించడానికి మధ్యవర్తిత్వం ఒక మంచి మార్గమని చెప్పారు. మీడియేషన్ సమర్థవంతంగా చేయగలిగితే కేసుల పెండెన్సీని తగ్గించవచ్చన్నారు. కోర్టులు కేసులను నిర్ణయించే విధంగా కాకుండా పరిష్కారం చూపించే విధంగా ఉండాలన్నారు. తీర్పులు త్వరితగతిన రావడానికి సాక్ష్యాలను త్వరగా ప్రవేశపెట్టడం వంటి వాటిలో పోలీసుశాఖ సహకారం అవసమని చెప్పారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ ఆర్.రఘునందన్, జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి, జస్టిస్ సుమతి జగడం, జస్టిస్ న్యాపతి విజయ్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా న్యాయాధికారి సునీత గంధం తదితరులు పాల్గొన్నారు.

# పొరపాటు మూల్యం 300 కోట్లు?

**ఏపీఎండీసీపై తీవ్ర ఆర్థిక భారం**
**సులియారీ బొగ్గు గ్రేడ్ నిర్ధారణలో తేడా**
**జీ6 గ్రేడ్‌గా అదానీకి టెండర్**
**తర్వాత జీ7 గ్రేడ్‌గా పేర్కొన్న సీసీవో**
**ఈ తప్పునకు బాధ్యత ఏపీఎండీసీదే అంటున్న అదానీ**



**క్రైం కౌంటర్ న్యూస్ మే 10:** ఓ చిన్న పొరపాటు రాష్ట్రానికి తీవ్రంగా నష్టం చేకూర్చేలా ఉంది. బొగ్గురకం గుర్తింపులోని ఆ పొరపాటు రాష్ట్ర గనుల శాఖకు రూ. 300 కోట్ల ఆర్థిక భారాన్ని మిగిల్చే పరిస్థితి కనిపిస్తోంది. జరిగిన తప్పును సరిదిద్దడానికి నానా తంటాలు పడాల్సి వస్తోంది. వివరాల్లోకి వెళ్తే, మధ్యప్రదేశ్‌లోని సులియారీలో ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ)కి బొగ్గు నిక్షేపాలున్నాయి. అక్కడ మైనింగ్, నిర్వహణ బాధ్యతలను అదానీ పవర్ గ్రూప్ దక్కించుకుంది. టెండర్లకన్నా ముందే సులియారీ బ్లాక్‌లో ఉన్న బొగ్గు జీ6 గ్రేడ్ అని నిపుణులు చెప్పారు. ఇదే గ్రేడ్‌తో అదానీ గ్రూప్‌నకు టెండర్ కట్టబెట్టారు. అయితే ఆ తర్వాత కోల్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీసీవో) అక్కడున్న బొగ్గు రకాన్ని జీ7 గ్రేడ్‌గా నిర్ధారించింది. ఇది ఏపీఎండీసీని ఇబ్బందుల్లోకి నెట్టేసింది. అక్కడున్నది జీ6 గ్రేడ్ అని టెండర్ కట్టబెట్టడం వల్ల తమపై రూ. 300 కోట్ల భారం పడుతోందని అదానీ గ్రూప్ చెబుతోంది. ఈ సమస్యను ఏపీఎండీసీనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆ భారం ఏపీ సంస్థే భరించాలని అదానీ సంస్థ తెగేసి చెప్పింది. ఇది ఎండీసీకి సంకటంగా మారింది. సులియారీ బొగ్గును జీ6గానే ప్రకటించాలని ఏపీఎండీసీ అనేక మార్లు సీసీవోకు విజ్ఞప్తి చేసింది. ఈ విషయంలో జోక్యం చేసుకొని సీసీవోకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని ఏపీ సర్కారు కేంద్రానికి పలు దఫాలుగా లేఖలు రాసింది. అయినా ఇటు కేంద్రంలో, అటు సీసీవోలో స్పందన లేదు. అసలు సీసీవో ఉద్దేశం ఏమిటి? అది ఏ ప్రాతిపదికన సులియారీ బొగ్గును జీ7 గా నిర్ధారించిందో తెలుసుకునేందుకు ఏపీఎండీసీ చివరకు ఆర్‌టీఐ అస్త్రాన్ని కూడా ఉపయోగించింది. అయినా కూడా సీసీవో స్పందించ లేదు.

ఏపీఎండీసీ విన్నపాలు, లేఖలకు సీసీవో స్పందించడం లేదని గుర్తించి అదానీ పవర్ న్యాయపరమైన చ ర్యలు ప్రారంభించింది. సులియారీ బొగ్గు గ్రేడ్ నిర్ణయంలో తప్పు వల్ల వచ్చే 300 కోట్ల భారం ఏపీఎండీసీనే భరించాలని, దీన్ని వివాద అంశంగా పరిగణించాలని అదానీ పవర్ డిస్ప్యూట్ నోటీసు జారీ చేసింది. ఈ వివాదం ముదరకుండా ఉండేందుకు ఏపీ గనులశాఖ, ఎండీసీ అధికారులు అదానీ పవర్‌తో సంప్రదింపులు ప్రారంభించారు. చర్చలతో సమస్యను పరిష్కరించుకుందామని ఆ సంస్థకు అధికారులు ఆఫర్ చేస్తూ గత మార్చిలో చర్చలు జరిపారు. కానీ ఆ చర్చలు ఆశాజనకంగా సాగలేదు. మరో దఫా సమావేశమై చర్చించాలని అధికారులు భావిస్తున్నారు. అయితే, ఈ రెండో దఫా చర్చలు కూడా ఫలించకపోతే ఆ అదనపు భారాన్ని ఏపీఎండీసీనే భరించాలనే డిమాండ్‌పై అదానీ పవర్ ఆర్బిట్రేషన్‌కు వెళ్లే అవకాశం ఉందని అధికారవర్గాలు చెబుతున్నాయి.

**సర్కారుముందున్న కర్తవ్యం**

అదానీ పవర్ ఏపీఎండీసీకి జారీచేసిన డిస్ప్యూట్ నోటీసును పరిష్కరించుకోవడానికి రెండు మార్గాలు కనిపిస్తున్నాయి. సులియారీలో ఉన్న బొగ్గు జీ6 గ్రేడ్ అని సీసీవోనే తన ఉత్తర్వులను సరిదిద్దాలి. లేదంటే, సీసీఓపైనే ఏపీఎండీసీ న్యాయపోరాటం చేయాలి. ఈ రెండింట్లో ఏదీ సాధ్యం కాకున్నా ఏపీఎండీసీ ఆ 300 కోట్ల అదనపు భారాన్ని మోయాల్సి ఉంటుంది. ఈవిషయంలో సర్కారు జోక్యం చేసుకోవాలని ఏపీఎండీసీ కోరుతోంది. కేంద్రంతో మాట్లాడి సీసీవో ఉత్తర్వులు మార్చేలా ఒత్తిడి తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబును గనుల శాఖ కోరుతోంది.

# పోలవరం-బనకచర్ల'ను ఆమోదించండి

**పోలవరం రెండో దశకు 32,000 కోట్లు ఇవ్వండి**
**రేపు కేంద్ర మంత్రి పాటిల్‌ను కోరనున్న సీఎం**



**క్రైం కౌంటర్ న్యూస్ మే 10:** పోలవరం-బనకచర్ల (నల్లమలసాగర్) అనుసంధాన పథకం ప్రీ ఫీజబిలిటీ రిపోర్టు(పీఎఫ్ఆర్)ను కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) ప్రాథమికంగా అంగీకరించినందున, దీనికి ఆమోదం తెలపాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరనుంది. అలాగే గోదావరి జలాల వినియోగంపై పొరుగు రాష్ట్రాలతో ఎదురవుతున్న సమస్యల పరిష్కారం కోసం ట్రైబ్యునల్ వేయాలని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను సీఎం చంద్రబాబు కోరనున్నారు. సోమవారం ఢిల్లీ పర్యటనలో భాగంగా పాటిల్‌తో చంద్రబాబు సమావేశం కానున్నారు. పోలవరం ప్రాజెక్టు రెండో దశ పనుల కోసం రూ.32,000 కోట్లను మంజూరు చేయాలని కోరనున్నారు. పోలవరం కుడి, ఎడమ ప్రధాన కాలువల విస్తరణ పనుల కోసం చేస్తున్న అదనపు వ్యయాలకు నిధులు మంజూరు చేయాలని విన్నవించనున్నారు. అదేవిధంగా చిన్న, మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టుల రిపేర్, రిస్టోరేషన్, రిన్నోవేషన్(ట్రిబుల్-ఆర్) పథకానికి నిధులు మంజూరు చేయాలని కోరనున్నారు. సముద్రంలోకి వృ?థాగా పోతున్న దాదాపు 3000 టీఎంసీల వరద జలాల్లో రోజుకు రెండు టీఎంసీల చొప్పున 200 టీఎంసీలను సద్వినియోగం చేసుకునేలా పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకానికి రూపకల్పన చేశామని వివరించనున్నారు. గోదావరి నదీ జలాల్లో రాష్ట్రానికి కేటాయింపులు చేసేందుకు ట్రైబ్యునల్ అవసరమని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నారు. గోదావరి, కృష్ణా నదులపై తెలంగాణ నిర్మిస్తున్న అక్రమ కట్టడాలకు అనుమతులు ఇవ్వవద్దని కోరనున్నారు. కర్ణాటకలో ఆల్మట్టి డ్యామ్ ఎత్తును 119 మీటర్ల నుంచి 124 మీటర్లకు పెంచేందుకు చేస్తున్న భూసేకరణ ప్రక్రియ సహా ఎత్తు పెంచేందుకు అనుమతులు ఇవ్వవద్దని విన్నవించనున్నారు.

# టిప్పుసుల్తాన్ సర్కిల్ కోసం ఓ వర్గం పట్టు

**హనుమాన్ సర్కిల్ కోసం మరో వర్గం ధర్నా**
**రాళ్లదాడి..పోలీస్ లాఠీచార్జి..**



**క్రైం కౌంటర్ న్యూస్ మే 10:** కడప నగరంలోని అల్మాస్‌పేట సర్కిల్ పేరు మార్పు వివాదానికి దారితీసింది. ఎన్నో ఏళ్ల నుంచి అల్మాస్‌పేట సర్కిల్‌గా పిలుచుకుంటున్న ఈ ప్రాంతానికి టిప్పుసుల్తాన్ సర్కిల్‌గా నామకరణం చేయాలని ఓ వర్గం డిమాండ్ చేస్తోంది. ఈ సర్కిల్ పక్కనే ఉన్న ఆంజనేయస్వామి గుడి వద్ద 31 అడుగుల హనుమాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. హనుమజ్జయంతి సందర్భంగా 12న విగ్రహ ప్రతిష్ఠ చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో హనుమాన్ సర్కిల్ అని రాయడం వివాదానికి కారణమైంది. శనివారం ఉదయం 9.30 గంటలకు ఇరువర్గాలు పోటాపోటీగా ఆందోళనలు ప్రారంభించాయి. మాజీ ఎమ్మెల్సీ పుత్తా న రసింహారెడ్డి, టీడీపీ కడప పార్లమెంట్ అధ్యక్షుడు భూపేశ్‌రెడ్డి, మైనార్టీ నేత ముక్తియార్ ఇరువర్గాల మధ్య చర్చలు జరిపారు. టిప్పుసుల్తాన్ బదులు మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం పేరు పెట్టాలని, లేకుంటే అల్మాస్‌పేటగానే కొనసాగించాలని ఓ వర్గం డిమాండ్ చేసింది. అయితే టిప్పుసుల్తాన్ పేరు ఉంచాలని మరో వర్గం పట్టుబట్టింది. చర్చలు జరుగుతుండగానే మధ్యాహ్నం 12 గంటల తర్వాత ఇరు వర్గాలు రాళ్లతో దాడికి తెగబడ్డాయి. ఈ దాడిలో తాలుకా సీఐ నరసింహరాజు తలకు గాయం కావడంతో కుప్పకూలిపోయారు. మరికొందరికి కూడా గాయాలయ్యాయి. దీంతో ఇన్‌చార్జి డీఎస్పీ బాలస్వామిరెడ్డి, పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టి, అక్కడి ఫ్లెక్సీలను తొలగించి 144 సెక్షన్ విధించారు. దాడులకు దిగిన అరాచకశక్తులపై చర్యలు చేపట్టాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ కోరారు.

**పేరు మార్చాలని కోరలేదు: కలెక్టర్**

అల్మ?మసపేట సర్కిల్ పేరు మార్చాలని అధికారికంగా ఎలాంటి రికార్డులు కాని, వినతులు కానీ లేవని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. నగర పాలకసంస్థలో కూడా ఎలాంటి ప్రతిపాదన కానీ, ఆమోదం కానీ లేవని శనివారం రాత్రి అన్నిమతాల పెద్దలతో కలెక్టరేట్‌లో జరిగిన శాంతి కమిటీ సమావేశంలో స్పష్టం చేశారు. మతసామరస్యాన్ని దెబ్బతీసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# తిరుచురాపల్లి ఈస్ట్ సీటుకు విజయ్ రాజీనామా

చెన్నై: తిరుచురాపల్లి ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గం సీటుకు తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఆదివారంనాడు రాజీనామా చేశారు. మంత్రులు కేఏ సెంగోట్టియన్, పి.వెంకటరణన్‌లు లెజిస్లేటివ్ అసెంబ్లీ సెక్రటరీని కలిసి విజయ్ రాజీనామా లేఖను అందజేశారు. ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పెరంబూర్, తిరుచురాపల్లి ఈస్ట్ అసెంబ్లీ సీట్లలో విజయ్ గెలిచారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం (ఆర్‌పీఏ)-1951 నిబంధనల ప్రకారం ఒక వ్యక్తి రెండు నియోజకవర్గాల్లోనూ గెలిస్తే ఒక సీటును వదులుకోవలసి ఉంటుంది. ఈ నేపథ్యంలో తిరుచ్చి ఈస్ట్‌ను వదిలి పెరంబూర్ నుంచి ఎమ్మెల్యేగా కొనసాగాలని విజయ్ నిర్ణయించారు. దీంతో ఖాళీ అయిన తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గానికి ఆరు నెలల్లోగా తిరిగి ఉప ఎన్నిక జరుగుతుంది.

# వైద్య పరికరాల కొనుగోలు వ్యవహారంపై ఆరోగ్య శాఖ కార్యదర్శికి మంత్రి సత్య ఆదేశం

**క్రైం కౌంటర్ న్యూస్ మే 10:** ఆరోగ్య శాఖలో వైద్య పరికరాల కొనుగోలులో జరిగిన అక్రమాల గురించి 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాలపై మంత్రి సత్యకుమార్ స్పందించారు. మెడికల్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఐడీసీ)లో పరికరాల కొనుగోలు వ్యవహారంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆరోగ్య శాఖ సెక్రటరీ సౌరబ్ గౌర్‌ను లిఖితపూర్వకంగా ఆదేశించారు. అవసరం లేకపోయినా ఎక్కువ ధరలకు వైద్య పరికరాలను కొనుగోలు చేస్తున్నారని, కొంతమంది సరఫరాదారులకు అనుగుణంగా సాంకేతిక ప్రమాణాలు రూపొందిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. డిస్ క్వాలిఫై అయిన కంపెనీలకు తిరిగి అవకాశాలు ఇస్తున్నట్లు వస్తున్న ఆరోపణలపై వెంటనే సమగ్ర నివేదికను సమర్పించాలని కార్యదర్శిని ఆదేశించారు. భవిష్యత్తులో ఆరోపణలకు తావులేకుండా నియమ నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా వైద్య పరికరాల కొనుగోలు జరపాలని మంత్రి ఆదేశించారు.

**నా పాత్ర లేదు: ఈడీ**

'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తా కథనాల నేపథ్యంలో మెడికల్ కార్పొరేషన్ (ఏపీఎంఎ?సఐడీసీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కృష్ణమోహన్ శనివారం మంత్రిని కలిసి వివరణ ఇచ్చారు. వైద్య పరికరాల కొనుగోలుకు సంబంధించిన సాంకేతిక ప్రమాణాల నిర్ధారణలో తనకు ఎలాంటి పాత్ర లేదని, కేవలం రెండు సందర్భాల్లో సాంకేతిక ప్రమాణాలను పునఃపరిశీలించాలని సూచించానని మంత్రికి తెలిపారు. డెంటల్ పేషెంట్ కుర్చీలకు సంబంధించి ఒక కంపెనీ పేరుతో వారి ప్రమాణాలను వైద్యులు సూచించగా, అవి నిబంధనలకు విరుద్ధం కనుక పునఃపరిశీలించాలని సూచించానని వివరించారు. అలాగే 16 స్లైస్‌తో కూడిన సిటీ స్కాన్ కొనుగోలుకు వైద్యులు సూచించగా, అలాంటి పరికరాల కొనుగోలు, సరఫరా తగ్గిన నేపథ్యంలో పునఃపరిశీలించాలని మాత్రమే సూచించానని, తాను అక్రమాలకు పాల్పడలేదని వివరణ ఇచ్చారు.

**కార్పొరేషన్‌లో ప్రక్షాళన అవసరం**

మెడికల్ కార్పొరేషన్‌లో వైద్య పరికరాల కొనుగోలులో భారీగా అక్రమాలు జరుగుతున్నాయి. నాణ్యతకు పాతరేస్తున్న అధికారులు తమకు నచ్చిన కంపెనీల నుంచి అవసరం లేకపోయినా పరికరాలు కొనుగోలు చేస్తున్నారు. ఆరేడు నెలల నుంచి ఈ తంతు జరుగుతోంది. 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనాల్లో ఏయే వైద్య పరికరాలను ఎంత మేరకు అధిక ధరలకు కొనుగోలు చేశారు, వాటి అసలు ధర ఎంత, ప్రభుత్వ నిధులు ఎంత మొత్తంలో దుర్వినియోగం చేశారు వంటి విషయాలను బహిర్గతం చేసింది. ఈ అక్రమాలపై ప్రత్యేక విచారణ చేయించాల్సిన అవసరం ఉంది. నివేదికలతో ప్రయోజనం ఉండదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రత్యేక విచారణ కమిటీని నియమించి మెడికల్ కార్పొరేషన్ ఇచ్చిన కొనుగోళ్ల ఆర్డర్లపై లోతైన దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉంది. మెడికల్ కార్పొరేషన్ మొత్తాన్ని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని ఆ దిశగా మంత్రి చర్యలు తీసుకోవాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.



## సినిమా



# హీరోల్లో ఇప్పటికీ ఆయనే నా క్రష్..

తెలుగు ప్రేక్షకులకు నటి కస్తూరి శంకర్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కథానాయికగా, సహాయ నటిగా సినిమాలు, సీరియల్స్ ద్వారా తనదైన ముద్ర వేసింది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. కింగ్ నాగార్జున పట్ల తనకున్న బాల్యపు అభిమానాన్ని, ఆయనతో కలిసి పనిచేసిన అపురూప జ్ఞాపకాలను పంచుకున్నారు. ఆమె చిన్నతనంలో యాంకర్‌గా పనిచేస్తున్న సమయంలో, ఒక స్టూడియోలో తన వర్క్ యాడ్ ఇస్తూ, ఎడిటింగ్‌లో ఉండగా నాగార్జున అన్నపూర్ణ ప్రొడక్షన్స్ తరపున ఏదో ఒక సినిమా పని మీద అక్కడికి వచ్చారని తెలిపారు. అప్పట్లో ఆమెకు నాగార్జున నటించిన సినిమా ఏదని తెలియదని, తాను చాలా చిన్నదని గుర్తుచేసుకున్నారు. అయితే, అప్పటికే గీతాంజలి సినిమాతో నాగార్జునకి అద్భుతమైన క్రేజ్ ఉండేదని, ఆయనను చూడగానే నాగార్జున... నాగార్జున అంటూ అందరూ సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారని ఆమె వివరించారు.నాగార్జుని మొదటిసారి చూసినప్పుడు ఆయన వేసుకున్న డ్రెస్, తాను వేసుకున్న డ్రెస్ కూడా తనకు స్పష్టంగా గుర్తుందని ఆమె పేర్కొన్నారు. ఇది సినిమాకు ముందు జరిగిన సంఘటన అని, ఆయనను చూసినప్పుడు చేయి ఇచ్చి, ఆ చేతిని కడుక్కోకుండానే పాఠశాలకు వెళ్లి అందరికీ చూపించి, అది నాగార్జునని చూసిన చెయ్యి అని గర్వంగా చెప్పానని ఆమె తెలిపారు. ఆ అనుభూతి తనకెంతో గొప్పదని, ఆయనతో జోడిగా పనిచేయడం ఒక కల నెరవేరినట్లే అని ఆమె సంతోషంగా చెప్పారు.సెట్‌లో నాగార్జునకి ఈ విషయం చెప్పారా అని అడిగినప్పుడు, తాను ధైర్యంగా చెప్పానని, ఆయన ఇప్పటికీ తన పట్ల చాలా ప్రత్యేకమైన వ్యక్తి అని ఆమె స్పష్టం చేశారు. తనకు అన్ని హీరోలు ఇష్టమే అయినా, నాగార్జున మాత్రం సినిమా రంగానికి రాకముందే ఇష్టమని ఆమె తెలిపారు. ఆయనకు చెప్పడమే కాకుండా, హచ్ అడ్వర్టైజ్‌మెంట్‌లో వచ్చే చిన్న కుక్కపిల్లలాగా ఆయన వెనకే తిరిగేదాన్నని ఆమె సరదాగా చెప్పారు. బిగ్ బాస్ షో ద్వారా నాగార్జునలోని మేధస్సు, వ్యక్తిత్వం అందరికీ తెలిశాయని, ఆయన చాలా స్మార్ట్ అని, చాలా విషయాలు చదువుతారని ఆమె అన్నారు. సెట్‌లో ప్రతిరోజూ ఇద్దరూ కలిసి వార్తాపత్రికలు చదివేవారని, ఆయన హెడ్‌లైన్స్ చదివితే, తాను లోపలి పేజీలు చదివేదాన్నని, ఆ తర్వాత పేపర్‌ను మార్చుకునేవారమని ఆమె వివరించారు. నాగార్జున క్రీడలను, ముఖ్యంగా క్రికెట్‌ను ఎంతగానో ఇష్టపడతారని, కడపలో షూటింగ్ చేస్తున్నప్పుడు దక్షిణాఫ్రికాలో ప్రపంచ కప్ మ్యాచ్‌లు జరిగేవని, ఉదయం నాలుగు గంటలకు మ్యాచ్ మొదలవుతుంటే, తాను వచ్చి చూసేసరికి ఆయన అప్పటికే ఎదురుచూస్తూ కూర్చొని ఉండేవారని ఆమె తెలిపారు. సినిమా రంగానికి అతీతంగా నాగార్జున ఒక ఆల్‌రౌండ్ కంప్లీట్ మ్యాన్ అని అన్నారు.



# ఉదయాన్నే ఇది ఒక్క గ్లాస్ తాగండి చాలు..

ఆధునిక జీవనశైలిలో ఎన్నో అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి.. ముఖ్యంగా మధుమేహం వంటి దీర్ఘకాలిక జబ్బుల ప్రమాదం గణనీయంగా పెరుగుతోంది.. అయితే, ఒక వ్యాధి రావడం అనేది మెరుగైన జీవనశైలి లేకపోవడానికి సూచనగా పరిగణించాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. జీవనశైలితోపాటు ముఖ్యంగా మనం తీసుకునే ఆహారం కూడా తీవ్ర ప్రభావం చూపుతుంది. రోగనిరోధక శక్తి బలంగా ఉండి, శరీరంలోని అవయవాలు సక్రమంగా పనిచేస్తుంటే, వ్యాధులు వచ్చే అవకాశం తక్కువగా ఉంటుంది. అందుకే, అనేక జబ్బులను మందులు, శస్త్రచికిత్సలు లేకుండానే తగ్గించుకోవచ్చని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు.ఉదాహరణకు, అధిక రక్తపోటు (బీపీ) కోసం ఉపయోగించే మందులు క్యాల్షియం ఛానల్ బ్లాకర్స్, డయూరిటిక్స్ వంటి అనేక రకాలుగా ఉంటాయి. రసాయనిక ఆధారిత మందులు కాకుండా, ఇంట్లో లభించే వస్తువులతోనే పరిష్కారాలను పొందవచ్చు. ముఖ్యంగా, కాకరకాయ రసం తాగడం వల్ల రక్తపోటు తగ్గి, బీపీ మందులు వాడాల్సిన అవసరం ఉండదని చెబుతున్నారు.

కాకరకాయ రసం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది.. ముఖ్యంగా మధుమేహం ఉన్నవారికి ఇది చాలా ప్రయోజనకరం. ఉదయం ఖాళీ కడుపుతో దీనిని తీసుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయి.. ఇంకా బరువు తగ్గడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి, జీర్ణక్రియను మెరుగుపరచడానికి సహాయపడుతుంది. విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లతో నిండిన ఈ రసం చర్మ ఆరోగ్యాన్ని, కాలేయ పనితీరును కూడా మెరుగుపరుస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఈ సహజ నివారణలు, ఔషధాల వలె లక్షణాలను తాత్కాలికంగా తగ్గించడమే కాకుండా, శరీరానికి హానికరం కాని మార్గాల్లో పని చేస్తాయి. సాధారణ మందులు వాడటం వల్ల కిడ్నీ సమస్యలు వంటి విపరీతమైన దుష్ప్రభావాలు వచ్చే అవకాశం ఉందని, ఒక్కో టాబ్లెట్‌కు 20–30 సైడ్ ఎఫెక్ట్‌లు ఉంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కానీ, చాలామంది ఈ దుష్ప్రభావాలను విస్మరించి, తేలికైన మార్గాలను ఎంచుకుంటారు. ప్రజలు నొప్పి వస్తే వెంటనే దానికి ఏదో ఒక టాబ్లెట్ వేసుకుంటారు.. ఇది మంచి పద్ధతి కాదు. ఇలాంటి



పరిస్థితుల్లో సమస్యలు రాకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడమే తెలివైన పని అని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. వ్యాధులు వచ్చినప్పుడు బిల్లులు కట్టడానికి బదులు, జీవనశైలిని మెరుగుపరచుకోవడం ద్వారా వాటిని నివారించడం ఉత్తమం.. ఇది కేవలం అవగాహన కోసం మాత్రమే.. ఏమైనా అనారోగ్య సమస్యలున్నా.. సందేహాలున్నా నేరుగా వైద్య నిపుణులను సంప్రదించండి..

# కందిపప్పు వీరికి విషంతో సమానం.



తెలుగు ఇళ్లలో రోజూ వండే వంటకాల్లో కందిపప్పు ప్రధానమైనది. ముద్దపప్పు, సాంబార్, పప్పుచారు.. ఇలా ఏ రూపంలోనైనా కందిపప్పును ఇష్టంగా తింటాం. ఇందులో ప్రోటీన్లు అధికంగా ఉండటం వల్ల శాఖాహారులకు ఇది ఒక గొప్ప వరమని భావిస్తారు. అయితే నాణేనికి రెండో వైపు ఉన్నట్లుగా.. మనకు ఎంతో ఇష్టమైన ఈ కందిపప్పు కొందరికి మాత్రం సైలెంట్ పాయిజన్‌లా మారుతుంది. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు దీనికి దూరంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అసలు కందిపప్పు ఎవరికి శత్రువు? ఎందుకు? అనే పూర్తి వివరాలు ఇప్పుడు చూద్దాం.

కిడ్నీ బాధితులకు పొటాషియం ముప్పు

కిడ్నీ సంబంధిత సమస్యలు ఉన్నవారికి ఆహార నియమాలు చాలా కఠినంగా ఉంటాయి. కందిపప్పులో పొటాషియం పరిమాణం చాలా ఎక్కువ. సాధారణంగా ఆరోగ్యవంతుల్లో కిడ్నీలు రక్తంలోని అదనపు పొటాషియంను బయటకు పంపిస్తాయి. కానీ కిడ్నీలు బలహీనపడిన వారిలో ఈ పొటాషియం బయటకు వెళ్లలేక రక్తంలోనే పేరుకుపోతుంది. దీనివల్ల గుండె లయ తప్పడం జరుగుతుంది. తీవ్రమైన సందర్భాల్లో గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంది. అంతేకాకుండా ఇందులో ఉండే ఆక్సలేట్లు కిడ్నీల్లో రాళ్లు ఏర్పడటానికి కారణమవుతాయి.

యూరిక్ యాసిడ్ -- కీళ్ల నొప్పుల సమస్య

ఈ రోజుల్లో చాలా మందిని వేధిస్తున్న సమస్య రక్తంలో యూరిక్ యాసిడ్ పెరగడం. కందిపప్పులో ప్యూరిన్లు అనే రసాయనాలు ఉంటాయి. ఇవి శరీరంలో విచ్ఛిన్నమైనప్పుడు యూరిక్ యాసిడ్ విడుదల అవుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిలు పెరిగితే అది స్ఫటికాలుగా మారి కీళ్ల మధ్య పేరుకుపోతుంది. దీనివల్ల గౌట్ అనే వ్యాధి వచ్చి కీళ్ల నొప్పులు, వాపులు, నడవలేని పరిస్థితి ఏర్పడుతుంది. మీకు ఇప్పటికే కీళ్ల నొప్పులు ఉంటే, కందిపప్పు తిన్న మరుసటి రోజే ఆ నొప్పులు తీవ్రమవ్వడం మీరు గమనించవచ్చు.

జీర్ణ వ్యవస్థ -- గ్యాస్ట్రిక్ సమస్యలు

కందిపప్పులో ప్రోటీన్లతో పాటు సంక్లిష్టమైన కార్బోహైడ్రేట్లు ఉంటాయి. వీటిని జీర్ణం చేయడానికి మన జీర్ణక్రియ కష్టపడాల్సి ఉంటుంది.

అజీర్ణం: తిన్న పప్పు సరిగ్గా అరగక కడుపు ఉబ్బరంగా అనిపించడం, గుండెల్లో మంట కలగడం సహజం.

గ్యాస్: పప్పులోని కొన్ని అంశాలు పేగుల్లోని బ్యాక్టీరియాతో కలిసి అధిక గ్యాస్‌ను విడుదల చేస్తాయి.

పైల్స్ బాధితులు: మూలవ్యాధి లేదా ఫిస్టులా ఉన్నవారికి కందిపప్పు మలబద్ధకాన్ని కలిగిస్తుంది. మలవిసర్జన కష్టంగా మారినప్పుడు ఆ ప్రాంతంలో ఒత్తిడి పెరిగి రక్తస్రావం లేదా వాపు వచ్చే అవకాశం ఉంది.

అలెర్జీలు -- చర్మ సమస్యలు

ప్రోటీన్ అలెర్జీ ఉన్నవారికి కందిపప్పు ఒక పీడకల. కొంతమందిలో కందిపప్పు తిన్న వెంటనే చర్మంపై దద్దుర్లు రావడం, దురద పెట్టడం లేదా కళ్లు ఎర్రబడటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. మన శరీరం ఆ ప్రోటీన్‌ను ఒక పరాయి పదార్థంగా గుర్తించి హిస్టామిన్‌లను విడుదల చేయడం వల్ల ఈ అలెర్జీ ప్రతిచర్యలు జరుగుతాయి.

బరువు తగ్గాలనుకునే వారు జాగ్రత్త

కందిపప్పులో క్యాలరీలు కూడా ఎక్కువే. మీరు కఠినమైన డైట్‌లో ఉండి బరువు తగ్గాలనుకుంటే, అతిగా కందిపప్పు తినడం వల్ల బరువు పెరిగే అవకాశం ఉంది. దీనికి బదులుగా తక్కువ క్యాలరీలు ఉండే పెసరపప్పును డైట్‌లో చేర్చుకోవడం ఉత్తమం.

ప్రత్యామ్నాయం ఏంటి?

కందిపప్పు పడదు కదా అని పప్పులు తినడం మానేయక్కర్లేదు. కందిపప్పుకు బదులుగా పెసరపప్పు అత్యుత్తమ ప్రత్యామ్నాయం. ఇది సులభంగా జీర్ణమవుతుంది. యూరిక్ యాసిడ్ పెంచదు. చల్లదనాన్ని ఇవ్వడంతో పాటు కిడ్నీలపై తక్కువ ఒత్తిడిని కలిగిస్తుంది.

గమనిక : ఈ వివరాలు కేవలం సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఏదైనా వైద్య పరిస్థితికి చికిత్స, ఆహార మార్పుల కోసం అర్హత గల ఆరోగ్య నిపుణుడి సలహా తప్పనిసరి.

# టీమిండియా టీ20 కెప్టెన్సీలో భారీ మార్పు..

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఈ ఏడాది మినీ వేలంలో ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్‌ను ఏకంగా 13 కోట్ల రూపాయల భారీ ధరకు దక్కించుకుంది. వేలంలో ఇతర జట్లతో పోటీ పడి మరీ అతడిని కొనుగోలు చేసిన ఆరెంజ్ ఆర్మీకి నిరాశే ఎదురైంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు కేవలం రెండు మ్యాచ్‌లే ఆడిన లివింగ్‌స్టోన్, బ్యాట్‌తో కేవలం 15 పరుగులు మాత్రమే చేశాడు. బౌలింగ్‌లోనూ ఒక్క ఓవర్ కూడా వేయకపోవడం గమనార్హం. అతనిపై పెట్టిన భారీ పెట్టుబడి ప్రస్తుతం వృథా అయినట్లే కనిపిస్తోంది.

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు: నిరాశపరిచిన జాకబ్ బెథెల్..


ఆర్సీబీ జట్టు గాయపడిన ఫిల్ సాల్ట్ స్థానంలో ఇంగ్లాండ్ యువ ఆటగాడు జాకబ్ బెథెల్‌ను జట్టులోకి తీసుకుంది. గతంలో మంచి ప్రదర్శన చేసినందుకుగాను అతడిని 2.60 కోట్ల రూపాయలకు అట్టిపెట్టుకుంది. అయితే ఈ సీజన్‌లో నాలుగు మ్యాచ్‌లాడిన బెథెల్ కేవలం 43 పరుగులు మాత్రమే చేశాడు. సగటు కేవలం 10.75గా ఉంది. అత్యధిక స్కోరు 20 పరుగులు మాత్రమే కావడం అతని పేలవ ఫామ్‌కు నిదర్శనం.

రాజస్థాన్ రాయల్స్: షిమ్రాన్ హెట్మెయర్ పేలవ ఆటతీరు..

మెగా వేలానికి ముందు రాజస్థాన్ రాయల్స్ జట్టు జోస్ బట్లర్ వంటి స్టార్ ఆటగాడిని వదులుకొని మరి షిమ్రాన్ హెట్మెయర్‌ను 11 కోట్ల రూపాయలకు అట్టిపెట్టుకుంది. కానీ హెట్మెయర్ ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోలేకపోయాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఏడు ఇన్నింగ్స్‌లలో కలిపి కేవలం 78 పరుగులు మాత్రమే చేశాడు. లక్నో జట్టుపై చేసిన 22 పరుగులే ఈ సీజన్‌లో అతడి అత్యుత్తమ స్కోరు. ఫినిషర్‌గా గుర్తింపు పొందిన హెట్మెయర్ ఇలా వరుసగా విఫలం కావడం పింక్ ఆర్మీని కలవరపెడుతోంది.

ఢిల్లీ క్యాపిటల్స్: డేవిడ్ మిల్లర్ 'కిల్లర్' ప్రదర్శన ఎక్కడ?

దక్షిణాఫ్రికా విధ్వంసకర బ్యాటర్ డేవిడ్ మిల్లర్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ 2 కోట్ల రూపాయల కనీస ధరకు కొనుగోలు చేసింది. మిడిల్ ఓవర్లలో వేగంగా పరుగులు తీస్తాడని భావించినప్పటికీ, అతను ఆశించిన స్థాయిలో ఆడలేదు. ఏడు మ్యాచ్‌ల్లో కలిపి 123




పరుగులు చేసినా, జట్టుకు అవసరమైన సమయంలో వేగంగా ఆడటంలో విఫలమయ్యాడు. గుజరాత్‌పై చేసిన 41 పరుగులు మినహా, మిగిలిన మ్యాచ్‌ల్లో మిల్లర్ ప్రభావం చూపలేకపోయాడు. దీంతో ఢిల్లీ ప్లే ఆఫ్స్ అవకాశాలు కూడా సంక్లిష్టంగా మారాయి.

Published by katikala Vara Prasad. Owned by katikala Vara Prasad. Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006.published at HNo:21-119 west ibrahimpatnam,krishna andhrapradesh 521456Editor. Katikala Vara Prasad.RNI APTEL/25/A2844. Ph:9849707349 . email:kvp6858@gmail.com.